ఆలేరు నుంచి పద్మశాలి మహాసభకు భారీగా వెళ్తున్న నేతన్నలు

పద్మశాలీల ప్రదర్శన

రాజాపేట, మార్చి 9 : హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే 17వ అంతర్జాతీయ పద్మశాలీ మహాసభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆదివారం పద్మశాలీలు పెద్ద ఎత్తున్న తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

మహాసభకు తరలి వెళ్లిన నేతన్నలు

ఆలేరు టౌన్ : ఆలేరు మండల కేంద్రం నుంచి పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం ఆధ్వర్యంలో నేతన్నలు, మహిళలు ఆదివారం భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ చేనేత సమస్యలను, రాజకీయరంగంలో పద్మశాలీల వాటా కోసమే మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పద్మశాలీలందరూ ఏకతాటిపైకి వచ్చి హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలీ సంఘం మాజీ అధ్యక్షుడు బింగి నర్సింహులు, పట్టణ ప్రధాన కార్యదర్శి చిక్క శ్రవణ్‌కుమార్, మెరుగు శ్రీధర్, కృష్ణ, ఎలగందుల లక్ష్మీనారాయణ, సామల సత్యరుషి, బడుగు జహంగీర్, వెంకటేశ్, ఉప్పలయ్య, సత్యనారాయణ, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండల కేంద్రం నుంచి పద్మశాలి నాయకులు, కార్మికులు సుమారు 600 మంది మహాసభకు తరలి వెళ్లారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడక రమేశ్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు సీత శ్రీరాములు, భారత బాలరత్నం, నాయకులు అంకం మురళి, ముసునూరి యాదగిరి పాల్గొన్నారు.

హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వాగులపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలి : మల్లేశం

ఆలేరు టౌన్, మార్చి 9 : పట్టణంలోని రత్నాల, ఈదుల వాగులపై హైలెవెల్ బ్రిడ్జిలు నిర్మించి, అసంపూర్తిగా ఉన్న సమీకృత మార్కెట్‌ను పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాటలో భాగంగా ఆదివారం వాగులు, సమీకృత మార్కెట్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న ఆలేరు.. సమస్యల కేంద్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు అధికంగా పడటం వల్ల వాగులు పొంగి చుట్టుపక్కల 20 గ్రామాలకు సంబంధాలు తెగిపోయే పరిస్థితి దాపురించిందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పందించి అసంపూర్తిగా ఉన్న మార్కెట్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఎంఏ ఇక్బాల్, మొరిగాడి రమేశ్, చంద్రశేఖర్, బాలరాజు, రాజేశ్, లక్ష్మణ్, రాజు, సాయి, సిద్దిరాములు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అంస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

ఆత్మకూరు (ఎం), మార్చి 9 : మండల కేంద్రానికి చెందిన ఎలగందుల బుచ్చమ్మ, ఎలిమినేటి యాదయ్య, ఆరె శంకరయ్య, ఎలగందుల లక్ష్మమ్మ, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి మృతుల కుటుంబాలకు అందించిన రూ.20 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరిదీప్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ యాస కవిత, నాయకులు భిక్షపతి, ఇంద్రారెడ్డి, దశరథగౌడ్, అజీముద్దీన్, రాంబాబు, శంకర్, అబ్బ సాయిలు, ప్రదీప్, అహ్మద్, క్రాంతికుమార్, స్వామి, రాజు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వలిగొండ : రెడ్లరేపాకలో శ్రీను కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

వలిగొండ, మార్చి 9 : మండలంలోని రెడ్ల రేపాక గ్రామానికి చెందిన జువ్వాగాని శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడితో పాటు 10వ తరగతి కలిసి చదువుకున్న స్నేమితులు రూ.61వేలు సమీకరించి ఆదివారం శ్రీను కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో సయ్యద్ సలీం పాష, యడవెల్లి అనిల్, పోతుగంటి శేఖర్, కాసుల సంజీవ, రాస శ్రీశైలం, దండ శ్రీను, చిర్ర చంద్రి, దేశపాక అశోక్, విజయ్, శ్రీనివాస్, గోపగాని వెంకటేశ్, పాల్వంచ గణేశ్, సిరికొండ శ్రీను, దేశపాక సుదర్శన్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రానికి చెందిన కొండ సునీత భర్త జంగయ్య గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమెతో పాటు 2000-01లో పదో తరగతి కలిసి చదువుకున్న విద్యార్థులు స్నేహితురాలిని ఆదివారం పరామర్శించి రూ.58వేలు ఆర్థికసాయం చేశారు. పూర్వ విద్యార్థులు బాలరాజు, రమణ, మహేశ్వరి, విజయ, రాజు, మురళి, కిశోర్, బాలకృష్ణ, మహేశ్, కిరణ్ పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్న ఎంజీరెడ్డి ట్రస్ట్ ప్రతినిధి సుమన

విద్యార్థులు కష్టపడి చదువాలి : సుమన

సంస్థాన్ నారాయణపురం, మార్చి 9 : విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి సర్వేల్ గురుకుల పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఎంజీ రెడ్డి ట్రస్టు ప్రతినిధి సుమన అన్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఉత్తమ విద్యార్థులకు ట్రస్టు తరుపున ఆదివారం స్కాలర్‌షిప్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేండ్లుగా గణపతిరెడ్డి జ్ఞాపకార్థం 1989 బ్యాచ్ సర్వేల్ గురుకుల పూర్వ విద్యార్థి మాధవరెడ్డి విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సత్యనారాయణ, రమణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మహేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాదగిరీశుడిపై ప్రభుత్వానికి భక్తి లేదు

- స్వామివారిని అవమానపర్చిన మంత్రులు
- కల్యాణానికి ఎందుకు హాజరు కాలేదో చెప్పాలి
- ఏ హోదాలో బీర్ల శంకర్, యాదగిరి ప్రభుత్వ పట్టువస్త్రాలు సమర్పించారు?
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, మార్చి 9 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవ కల్యాణానికి రాష్ట్ర మంత్రులు హాజరుకాక పోవడం స్వామివారిని అవమాన పర్చడమేనని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య విమర్శించారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వానికి యాదగిరీశుడిపై భక్తి లేదని, 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో స్వామివారికి అవమానం జరుగుతూనే ఉందని ఆరోపించారు. గుట్ట అభివృద్ధికి ఒక్కపైసా నిధులు కేటాయించ లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ యాదగిరిగుట్టను ఎంతో అద్భుతంగా తీర్చిదిద్ది సంపదను సృష్టిస్తే, రేవంత్ సర్కార్ మాత్రం దాన్ని కొల్లగొట్టే ప్రయత్నం చేస్తుందని మండి పడ్డారు. స్వామి వారి ఉత్సవాలను ప్రొటోకాల్ పాటించకుండా ఈఓ భాస్కర్‌రావు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శనివారం జరిగిన బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్సీ కోటిరెడ్డిని వెనుక కూర్చీలో కూర్చోబెట్టి అవమానించారన్నారు. ప్రతిసారి ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టుచీరలను దేవదాయశాఖ మంత్రి అందజేస్తారని, కానీ ఈ ఏడాది మాత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులు బీర్ల శంకర్, ఈరసరపు యాదగిరిగౌడ్ అందించారన్నారు. వారు ఏ హోదాలో ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను అందించారో చెప్పాలని ప్రశ్నించారు. అదే విధంగా పట్టు వస్త్రాలను కల్యాణ మండపాన్ని ఎక్కి సమర్పించడం ఆలయ సంప్రదాయానికి విరుద్ధమన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో స్వామివారి కల్యాణానికి ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి, ఇతర జిల్లా మంత్రులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపినట్లు గుర్తు చేశారు. రూ.3 వేల టికెట్ తీసుకొని కల్యాణంలో పాల్గొన్న భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. వీవీఐపీ లాబీ మొత్తం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే నిండిపోయారని, కొండపైకి కాంగ్రెస్ పార్టీ నాయకులు వాహనాలను అనుమతినిచ్చి సాధారణ భక్తులకు అనుమతినివ్వకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తి చెందినట్లు తెలిపారు. కార్యక్రమంలో నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీఖర్‌రెడ్డి, పాల సంఘం చైర్మన్ మారెడ్డి కొండల్‌రెడ్డి, మాసాయిపేట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుణగంటి బాబురావు పాల్గొన్నారు.

రాజాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రేణికుంట రైతులు

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని పోలీస్ స్టేషన్‌లో రైతుల ఫిర్యాదు

రాజాపేట, మార్చి 9 : మండలంలోని రేణికుంట వాగులో నుంచి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ఆదివారం గ్రామ రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులు వట్టి పోతున్నాయని, ఇదే తీరు కొనసాగితే మండలమంతా ఏడారిగా మారుతుందని, అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆత్మకూరు (ఎం)లో తెల్లవారుజామున 5 నుంచి 8 గంటల వరకు కురిసిన మంచు

రాత్రి మంచు.. మధ్యాహ్నం ఎండ

ఎండ తీవ్రత తాళలేక మధ్యాహ్నం నెత్తిమీద కండువాతో వెళ్తున్న వ్యక్తి

ఆత్మకూరు (ఎం), మార్చి 9 : వాతావరణంలో ఆదివారం మూడు మార్పులు చోటు చేసుకున్నాయి. తెల్లవారుజామున 5 నుంచి 8 గంటల వరకు మండల కేంద్రంలో దట్టమైన మంచు కురిసింది. 8 తరువాత ఒక గంట పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం 10 గంటల నుంచి ఎండ పెరిగింది. మధ్యాహ్నం 12 గంటల వరకు ఎండ తీవ్రత అధికమవ్వడంతో బయటికి వెళ్లిన వారు రక్షణగా గొడుగులు, తువ్వాల కప్పుకొని ఉపశమనం పొందారు. ఒకే రోజు వాతావరణంలో ఇన్ని మార్పులు చోటు చేసుకోవడంతో ప్రజలు ఒకింత ఇబ్బందులు పడ్డారు.

ఇసుక డంప్ సీజ్

వేములకొండలో పోలీసులు సీజ్ చేసిన ఇసుక డంప్

వలిగొండ, మార్చి 9 : మండలంలోని వేములకొండ గ్రామ పరిధిలోని మూసీ నది పరివాహక ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలించి నిల్వ చేసిన డంప్‌ను ఆదివారం స్థానిక పోలీసులు సీజ్ చేశారు. వేములకొండ గ్రామానికి చెందిన ఏర్పుల యాదయ్య అనే వ్యక్తి ఇసుకను తరలించి అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు యాదయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

రాజాపేటలో పశుగ్రాసానికి ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న రైతు కనకయ్య

పశుగ్రాసానికి ట్యాంకర్‌తో నీళ్లు

రాజాపేట, మార్చి 9 : మండల కేంద్రానికి చెందిన రేగు కనకయ్య తనకు ఉన్న మూడు బోర్లతో ఎకరంలో వరి సాగు చేశాడు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లన్నీ ఒట్టిపోయాయి. దాంతో సాగు చేసిన ఎకరం పొలం పూర్తిగా ఎండిపోవడంతో పశువుల మేతకు వదిలేశాడు. తనకున్న ఆరు పశువుల కోసం వేసిన పశుగ్రాసం సైతం నీళ్లు లేక ఎండిపోతుండడంతో ట్యాంకర్‌తో పోసి కాపాడుకుంటున్నాడు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తుంగతుర్తి, మార్చి 9: మండల కేంద్రానికి చెందిన కొండ పద్మ అనే మహిళకు మంజూరైన రూ.31 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పల రాంబాబు మాట్లాడుతూ.. నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండ రాజు, వంశీ, అశోక్, వెంకన్న, సిద్దిక్ పాల్గొన్నారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు

చివ్వెంల, మార్చి 9: మండల కేంద్రంలోని ఊర చెరువు మట్టిని కొందరు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆదివారం జేసీబీల సాయంతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించారు. చెరువు ఇప్పటికే అడుగంటి పోవడంతో కొత్తగా చేపడుతున్న భవన నిర్మాణాలకు మట్టిని సరఫరా చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. అధికారులు ఊర చెరువును సందర్శించి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు ప్రజావాణి : కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 9 : నేడు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గత కొన్ని వారాలుగా నిలిచిపోయిన ప్రజావాణి తిరిగి సోమవారం యథావిధిగా ప్రారంభమవుతుందని చెప్పారు. అర్జీదారులు, ప్రజలు గమనించాలని కోరారు.

ఆర్టీఐ ఆక్టివిస్ట్స్ జిల్లా ఉపాధ్యక్షుడిగా యుగంధర్

యుగంధర్

గుండాల, మార్చి 9 : ఆర్టీఐ ఆక్టివిస్ట్స్ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గౌళికర్ యుగంధర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల గణేశ్ ఆదివారం యుగంధర్‌కు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలయ్యేందుకు తన వంతు కృషి చేస్తానని, చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తానన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జవాబుదారీతనం సమాచార హక్కు చట్టం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

'ఎల్ ఆర్ఎస్‌లో దరఖాస్తుదారులకు అన్యాయం'

భువనగిరి అర్బన్, మార్చి 9 : మున్సిపాలిటీలో 2010 నుంచి 2015 ఏండ్ల మధ్య లేఅవట్‌లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఎల్ఆర్ఎస్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని పట్టణానికి చెందిన ఎస్.మల్లేశ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. 2015లో ఎల్ఆర్ఎస్ స్కీమ్‌లో దరఖాస్తు చేసి, నాలా చార్జీలు మినహాయింపు, టెక్నికల్ సెక్యూరిటీ పొందిన దరఖాస్తుదారులకు ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ మేళాలో అవకాశం ఇవ్వక పోవడంతో అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. 2015 దరఖాస్తు దారులకు కూడా ఈ ఎల్ఆర్ఎస్ మేళాలో అవకాశం కల్పించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు పోటీ పరీక్షల ఫలితాలు నిలిపివేయాలి : లక్ష్మణ్

భూదాన్‌పోచంపల్లి, మార్చి 9 : ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు అన్ని రకాల పోటీ పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తప్పకుండా అమలు చేస్తామని నిండు సభలో సీఎం రేవంత్ ప్రకటించారని, గ్రూప్-2, డీఎస్సీ ఉద్యోగ పరీక్ష ఫలితాలను ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాతే వెల్లడించాలని కోరారు. ఈ నెల 12న అసెంబ్లీ సమావేశాలు జరిపి వర్గీకరణ చట్టబద్ధత కోసం తీర్మానం చేసి పార్లమెంటుకు బిల్లు పంపుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత రాకముందే ఉద్యోగ నియామకాలు చేపడితే ఎస్సీలో మాదిగలు, మాదిగ ఉపకులాలు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

తుంగతుర్తి, మార్చి 9: మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన ఏఎస్ఐ శిరంశెట్టి వెంకటేశ్వరరావు తన తల్లిదండ్రులు జనార్ధన్‌రావు, కౌసల్య జ్ఞాపకార్థం ఆదివారం తుంగతుర్తికి చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారులకు రూ.12 వేల విలువైన దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు సోమన్న, గాజుల యాదగిరి, కొండగడపుల యాకయ్య, తునికి వెంకన్న, భాస్కర్, బొంకురి శ్యాంసుందర్, ఎల్లబోయిన భిక్షం, నాగయ్య, నర్సయ్య, అబ్బగాని సత్తయ్య పాల్గొన్నారు.

పులిగిల్లలో పాడి రైతులతో కలిసి మాట్లాడుతున్న కందాడి సత్తిరెడ్డి

పాడి రైతుల ధర్నాను జయప్రదం చేయాలి : సత్తిరెడ్డి

వలిగొండ, మార్చి 9 : ఈ నెల 11న కలెక్టరేట్ ఎదుట పాడి రైతులు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందాడి సత్తిరెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని వెల్వర్తి, సుంకిశాల, పులిగిల్ల, గోలిగూడెం గ్రామాల పాడి రైతులతో కలిసి ఆదివారం ఆయన పులిగిల్లలో మాట్లాడుతూ మదర్ డెయిరీ ఆస్తులు విక్రయించొద్దని, పెండింగ్ బిల్లులను చెల్లించి పాడి రైతులకు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాడి రైతులు వాకిటి వెంకట్‌రెడ్డి, కొండె కిష్టయ్య, ముత్యాలు, పాపయ్య, లక్ష్మమ్మ, తుమ్మల సత్యనారాయణరెడ్డి, కొలను ఆదిరెడ్డి, పర్వతం శ్రీశైలం, అశోక్ పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి : సీఐ సంతోష్‌కుమార్

వాహనదారులకు సూచనలు చేస్తున్న రూరల్ సీఐ వి.సంతోష్‌కుమార్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 9 : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని రూరల్ సీఐ వి. సంతోష్‌కుమార్ అన్నారు. పట్టణ పరిధిలోని రాయగిరి చౌరస్తా వద్ద ఆదివారం వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు, నిబంధనలపై అవగాహన కల్పించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడుపాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగం వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో రూరల్ పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.



ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డికి పీఆరియూ టీజీ జిల్లా కమిటీ విలీన పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు రేపాక గిరిధర్‌రెడ్డి

డీఏల కోసం రాజీ లేకుండా పోరాడాలి : గిరిధర్‌రెడ్డి

బొమ్మలరామారం, మార్చి 9 : ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన డీఏ బకాయిలు, పాత పింఛన్ పథకం పునరుద్ధరణ, ఏఎస్ఎఫ్ఏ ఉద్యోగుల క్రమబద్ధీకరణ వంటి అంశాలపై రాజీలేని పోరాటాలు చేయాలని పీఆర్టీయూ టీజీ జిల్లా అధ్యక్షుడు రేపాక గిరిధర్‌రెడ్డి అన్నారు. 40 మంది సంఘం సభ్యులతో కలిసి ఆదివారం ఆయన హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి సమక్షంలో పీఆర్టీయూ టీజీ సంఘాన్ని పీఆర్టీయూ టీఎస్‌లో విలీనం చేశారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల డిమాండ్ల సాధనే ధ్యేయంగా విలీన ప్రక్రియకు అమోదించామన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుంట్ల అమరేందర్‌రెడ్డి, గడసంతల ముధుసూదన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు పట్టాబి సీతారాంరెడ్డి, షేక్ హాజీ, జిల్లా కమిటీ సభ్యులు బల్ల ఉపేందర్‌రావు, జగన్, పైళ్ల కరుణాకర్‌రెడ్డి, విజయభారతి, తాడురి వెంకన్న, నాగిరెడ్డి, బాశెట్టి విష్ణు, సంపత్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యాదగిరి నరసింహస్వామి శతకాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యాపకుడు లక్ష్మీనారాయణ

సాహిత్య సృజనలో మేటి మల్లారెడ్డి : లక్ష్మీనారాయణ

భువనగిరి అర్బన్, మార్చి 9 : తెలుగు సాహిత్య సృజనలో తనదైన ప్రతిభను చాటుతూ వచ్చే తరాలకు మార్గదర్శిగా నిలిచిన గొప్ప కవి డాక్టర్ తూర్పు మల్లారెడ్డి అని విశ్రాంత అధ్యాపకుడు లక్ష్మీనారాయణ అన్నారు. భువనగిరి ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్లారెడ్డి, యాదగిరి నరసింహ శతకాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్, గౌరవ కార్యదర్శి టీఎస్. వంశీతిలక్, డాక్టర్ మలుగ అంజయ్య, కవులు దోరవేటి చెన్నయ్య, డాక్టర్ నలపోలు నరసింహారెడ్డి, దేవినేని అరవిందరాయుడు, వాకిటి రాంరెడ్డి, గుమిడెల్లి వెంకన్న, రెబ్బ మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఇంద్రియాల గ్రామంలో ఎన్నికైన రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 9 : మండలంలోని ఇంద్రియాల గ్రామంలో సార్ల మైసమ్మ ఆలయ ఆవరణలో రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నోముల మాధవరెడ్డి, నాయకులు వారాల యాదిరెడ్డి, వారాల నర్సిరెడ్డి సమక్షంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మేకల జంగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా నోముల సైదుల్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీగా మేకల భూపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా వంగేటి దామోదర్‌రెడ్డి, కోశాధికారిగా జిట్టా సత్యంరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బద్దం భూపాల్‌రెడ్డి, వారాల సుధాకర్‌రెడ్డి, వంగేటి దయాకర్‌రెడ్డి, బద్దం కొండల్‌రెడ్డి, యలమ బాల్‌రెడ్డి, యలమ సత్తిరెడ్డి ఎన్నికయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న దోనూరి నర్సిరెడ్డి

నీళ్లు అందించడంలో ప్రభుత్వం విఫలం : నర్సిరెడ్డి

చౌటుప్పల్, మార్చి 9 : ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు సంఘం జిల్లా నాయకుడు దోనూరి నర్సిరెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన రైతు సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. చెర్లగూడెం, నక్కలగండి, రాచకొండ తదితర రిజర్వాయర్లను ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడంతో నియోజకవర్గంలో కరువు ఛాయలు అలుముకున్నాయన్నారు. ఆయా ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు నిరందించాలని డిమాండ్ చేశారు. నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, చీర్క అలివేలు, దోడ యాదిరెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, చీర్క సంజీవరెడ్డి, జి.శ్రీనివాసచారి, శ్రీశైలం పాల్గొన్నారు.